అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 13 ఫిబ్రవరి 2023 పేజీలు : 04

# 10వ రోజు 200 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న శ్రీశైలం పాదయాత్ర

**- ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి.. నారా చంద్రబాబునాయుడు పాలన రావాలని పాదయాత్ర - టిడిపి నేత పిజెఆర్**



పాదయాత్రలోని దృశ్యాలు



**అనంతపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం నుంచి శ్రీశైలం వరకు నిర్వహించిన పాదయాత్ర పదవ రోజు 200 కిలోమీటర్లు పూర్తి చేసుకుందని పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. గుంతకల్ నియోజకవర్గానికి చెందిన పిజెఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి అనంత పురం నుంచి మహా పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ఫిబ్రవరి 3న పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం ఏడు అడుగుల శివలింగానికి పాలాభిషేకం చేసుకుంటూ 10వ రోజు పెసరవాయి నుంచి వెలుగోడు వరకు కొనసాగిన పాదయాత్ర 200 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. అనంతరం జీవానందరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగయువతకు ఉపాధి కల్పించాలని రైతన్నలు, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పాదయాత్ర చేస్తున్నానన్నారు. రోజురోజుకు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఎక్కువయ్యారని, రైతన్నలను నకిలీ విత్తనాలు ఎరువులతో పంటలు పండక పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులను జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. నిత్యవసర సరుకులు రోజురోజుకి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. మద్యం నిషేధం చేయాలంటే ధరలు పెంచామన్న వైసీపీ ప్రభుత్వం ఈ రోజు ప్రజలు తినకూడదని నిత్యవసర సరుకుల ధరలు పెంచుకుంటూ పోతున్నారా అన్నారు. ప్రజలందరూ సంతోషంగాఉండాలంటే నిరుద్యోగ యువతకు ఉద్యోగం రావాలంటే రైతన్న సంతోషంగాఉండాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. మనమందరం కలిసి ఆయన్ని గెలిపించుకోవాలన్నారు. నారా లోకేష్ వారి యువగళం పాదయాత్ర 200 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తి చేసుకుంది. 200 కిలోమీటర్లకే వైసీపీ ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతుంది. 4000 కిలోమీటర్లుకి ఇంకేం అయిపోతుందో, నారా లోకేష్ యువగళానికి వస్తున్న ప్రజాదనాన్ని చూసి జగన్ రెడ్డి యువగళానికి ఆటంకాలు సృష్టిస్తున్నారని, ఎన్ని ఆటంకాలు సృష్టించిన యువగళం ఆగదన్నారు. ఆ శివుని కృపాకటాక్షాలతో యువగళం పాదయాత్ర విజయవంతం అవుతుందన్నారు.

# అస్తవ్యస్తంతో మచ్చ...అవస్థలతో రచ్చ..!

**- రూ. 3.3 కోట్ల స్థలంపై మూడు వర్గాల పోరాటం..! - రికార్డులు సక్రమంగా లేని స్థలంపై అందరి ఆశలు..!**





గతంలో ఇచ్చిన స్థలాల్లో కర్రలు నాటిని లబ్ధిదారులు, వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**తాడిపత్రి, ప్రభాతవార్త**

తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి తర్వాత అత్యధిక ధరలు పలుకుతున్న స్థలాలు ఎక్కడైనా ఉన్నాయా అంటే వెంటనే స్ఫురించే పేరు రాయలచెరువే. ఇక్కడ ఒక సెంటు ధర రూ. 3 లక్షల నుంచి రూ. 22 లక్షల వరకు పలుకుతోందంటే అతిశయోక్తి కాదు. దీంతో గ్రామకంఠాల కబ్జాతో పాటు అడుగు నేల కోసం కూడా స్టేషన్ల చుట్టూ తిరిగే పంచాయితీలకు కొదవ లేదు. ఇక్కడ సీలింగ్ యాక్టు(భూగరిష్ట పరిమితి చట్టం) కింద 1976లో ప్రభుత్వ పరమైన 1.10 ఎకరాల భూ వివాదం 47 ఏళ్లుగా నానుతూనే ఉంది. మాదంటే మాదని మూడు వర్గాలు ఈ స్థలం కోసం పోరాడుతున్నారు. ఇటీవల సర్వత్రా చర్చనీయాంశంగా మారిన సర్వే నంబరు 631లోని 1.10 ఎకరా స్థలంలో రెండు రోజుల కిందట తమకు గతంలో ఇళ్ల పట్టాలిచ్చారంటూ 30 మందికి పైగా పాగా వేయడానికి ప్రయత్నించడంతో వివాదం రాజుకుంది.

**సీలింగ్‌లో పోయినా మేమే దక్కించుకున్నాం..!**

మా పెద్దల నుంచి 1976లో సీలింగ్ యాక్టు కింద ప్రభుత్వం తీసుకున్నా దాన్ని తిరిగి మేమే దక్కించుకున్నామని ఆ భూమి పూర్వపు యజమానులు చెబుతున్నారు. తమతో 1.10 ఎకరాల భూమి తీసుకున్న తర్వాత ఓ వ్యక్తికి ప్రభుత్వం డి.పట్టా మంజూరు చేయగా అతను సొసైటీలో తనఖా పెట్టాడని, సదరు తనఖా సొమ్మును దీర్ఘకాలం పాటు చెల్లించకపోతే తామే చెల్లించి ఆ భూమిపై హక్కులు పొందామని వారు పేర్కొంటున్నారు. మాది కాబట్టే సదరు స్థలంలో ఆర్డీటీ పాఠశాలతో పాటు గుడి నిర్మాణానికి కూడా స్థలం ఇచ్చామని వారు అంటున్నారు. సర్వే నం. 631లోని స్థలంపై తమకు హక్కులున్నాయనే తాము కోర్టులో వ్యాజ్యం వేశామని, ప్రస్తుతం కోర్టు నిర్ణయం రావాల్సి ఉందని ఆ కుటుంబ పెద్ద నాగభూషణరెడ్డి తెలిపారు.

**మా ఆస్థి అనడానికి అన్ని ఆధారాలున్నాయి..!**

సీలింగ్ యాక్టు కింద సేకరించిన సర్వే నం. 631లోని 1.10 ఎకరా భూమిని 1979లో ప్రభుత్వం తన తండ్రి పెద్ద సుంకన్న పేరున డి.పట్టా మంజూరు చేసిందని, సదరు భూమిపై మా కుటుంబానికే హక్కుందని రాయలచెరువుకు చెందిన వెంకట్రాముడు అధికారులచుట్టూ తిరుగుతున్నాడు. ఆర్ఎస్ఆర్‌లో జి.డి పట్టాగా నమోదైందని, పట్టా మంజూరైనప్పటి నుంచి 2013 వరకు సాగులో ఉన్నామంటూ తన వద్ద ఉన్న ఆధారాలను చేతపట్టుకొని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల వరకు ఆతను తిరుగుతున్నాడు. తన తండ్రి మరణించడంతో తన తల్లి పేరున మ్యుటేషన్ చేయమంటూ రెవెన్యూ అధికారులను ఆయన వేడుకుంటున్నాడు. మరింత సమాచారం సేకరించిన తర్వాత తాను కూడా కోర్టును ఆశ్రయిస్తానని వెంకట్రాముడు అంటున్నాడు.

**మాకు పట్టాలిచ్చారు..మాకే హక్కుంది..!**

సీలింగ్ యాక్టు కింద సర్వే నం.631లో ప్రభుత్వం సేకరించిన 1.10 ఎకరాల స్థలంలో ఎవరూ అనుభవంలో లేరని గుర్తించిన రెవెన్యూ అధికారులు దళితులమైన మాకు 01.11.1991లో ఇళ్ల పట్టాలిచ్చారని రాయలచెరువు ఎస్సీ కాలనీకి చెందిన 30 మంది లబ్ధిదారులు అంటున్నారు. తమకు ఇళ్ల పట్టాలి చ్చారు గాని ఎవరికి ఎక్కడ కేటాయించారో భౌతికంగా చూపాలని సదరు లబ్ధిదారులు చాలా కాలం నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తహసీల్దార్ నుంచి ఎస్సీ కమిషన్ చైర్మన్ వరకు ఈ సమస్యను తీసుకొని పోయామని, పరిష్కారం లభించలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివాదాస్ప దంగా మారిన ఈ స్థలంపై అధికారుల చర్యలు జాప్యం కావడంతో ఇటీవల లబ్ధిదారులు తమకు తామే సదరు స్థలాన్ని ఆక్రమించుకోవడం చర్చకు దారితీసింది.



సదరు స్థలం మాదేనంటున్న వెంకట్రాముడు

అయితే సర్వే నం. 631లోని దాదాపు రూ. 33 కోట్ల విలువైన సదరు వివాదాస్పద స్థలానికి సంబంధించిన రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటం, దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో తాము ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. 1991లో 30 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినప్పటికీ సదరు లబ్ధిదారులు ఆ స్థలాల్లో ఎలాంటి ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని, అనుభవించు కోవడానికి వారికి ఆసక్తి లేదని పేర్కొంటూ 2001లో అప్పటి తహసీల్దార్ ఉన్నతాధికారులకు నివేదించడంతో లబ్ధిదారుల పట్టాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుతం స్థలాల ధరలు ఆకాశాన్నంటడంతో ఈ మూడు వర్గాలు సదరు స్థలం కోసం రాజీలేని పోరాటాలు చేస్తుండటంపైన, అధికారుల చర్యలపైనా ఉత్కంఠత నెలకొంది.

# ముగిసిన రాతిదూలం పోటీలు


**- మొదటి విజేతగా బోరెడ్డి కేశవరెడ్డి రుషభాలు కైవసం**



ఆలయ నిర్వహకుడు పిల్లల కిష్ట ఆధ్వర్యంలో ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**గార్లదిన్నె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో నిర్వహించినటువంటి మాఘమాసం నాలుగో వారంలో క్షేత్ర పాలకొండ సింగరప్ప స్వామి తిరునాల మహోత్సవ సందర్భంగా ప్రతి సంవత్సరం నాలుగవ ఆదివారంలో బండలాగుడు పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నందున అందులో భాగంగానే ఆలయ కమిటీ నిర్వహకులు పిల్లలకిష్ట ఆధ్వర యంలో నిర్వహించారు. న్యూ కెటగిరీ విభాగానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అలాగే వారి చేతులమీదుగా 50వేల రూపాయలను మొదటి విజేతలకు అందజేశారు. రాతి దూలంను శ్రీ వేంకటేశ్వర మిల్ టెక్ రైస్‌మిల్ అధినేత వెంకటరాముడు రాతిదూలంలో అందజేశ్రారు. రెండో బహుమతి దాతలు పిల్లల తిరుపాల్ రైస్ మిల్ వెంకటరాముడు ఆధ్వర్యంలో 40,000 రూపాయలు, మూడో బహుమతి దాతలు చిన్న లాల్‌స్వామి నాలుగో బహుమతి దాతలు పెద్దలాల స్వామి, ఐదవ బహుమతి దాత వంకరాజు కాలువ నాగరాజు, ఆరో బహుమతి దాత అలవాడ వీరయ్య, ఏడవ బహుమతి దాత క్రీస్తు శేషు, తనికెత్తుల ఓబులేసు, వారి కుమారులు, 8వ బహుమతి దాత పిల్లల రాజేంద్ర ఎగువపల్లి విజేతలుగా నిలిచారు. ఈ రాతిదూలం లాగుడు పోటీల కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు తరిమెల ప్రదీప్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కణంపల్లి నరేందర్‌రెడ్డి, బండలాగుడు పోటీలు నిర్వహకులు పాత కల్లూరు తిరుపాల్, రైస్ మిల్ వెంకటరాముడు, ఎగువపల్లి రవి, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

# సహకార పటిష్టతకు కృషి

**- ఎమ్మెల్యే వైవిఆర్, మాజీ ఎంపి జె.సి, మాజీ ఎమ్మెల్యేలు మధు, గౌడ్**



ఎమ్మెల్యే వైవిఆర్ మాట్లాడుతున్న దృశ్యం



ఖాతాదారులు హాజరైన దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

ప్రజా ప్రయోజనార్థం సహకార వ్యవస్థ పటిష్టతకు సహకారరంగాన్ని బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపి జె.సి దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మధుసూదన్‌గుప్తా, జితేంద్రగౌడ్, రాష్ట్ర అర్బన్‌బ్యాంకు, ట్రేడ్ సొసైటీ ఫెడరేషన్ అధ్యక్షులు మాజీ ఎంపి చిట్టూరు రవీంద్ర, తదితరులు పేర్కొన్నారు. గుత్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు స్థాపితమై వంద సంవత్సవాలు అయిన నేపథ్యంలో స్థానిక స్పందన ఫంక్షన్‌హాల్‌లో చైర్మన్ అబ్దుల్‌జిలాన్ అధ్యక్షతన ఆదివారం శతాబ్దివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1923లో ప్రారంభమైన బ్యాంకు ప్రస్తుతం ప్రతి ఏడాది 180 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 95 కోట్ల డిపాజిట్లు, 81 కోట్ల అడ్వాన్స్‌లు, 5 కోట్ల షేర్‌క్యాపిటల్, 5366 మంది షేర్‌హోల్డర్లకు 12 శాతం డివిడెండ్ ఇవ్వడం బ్యాంకుకే గర్వకారనమన్నారు. రుణం పొందిన ప్రతి ఒక్కరు తమ బకాయిలు సక్రంగా చెల్లించి బ్యాంకు పురోభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. అనంతరం ప్రస్తుత డైరెక్టర్లతో పాటు గతంలో పనిచేసిన డైరెక్టర్లను ఘనంగా సత్కరించి మెమొంటోలను అందచేశారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య, ఆదోని బ్యాంకు అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, విశాఖపట్టణం బ్యాంకు అధ్యక్షులు చలసాని రాఘవేంద్రరావు, తనుకు బ్యాంకు అధ్యక్షులు వెంకటరత్నం, రాజమండ్రి బ్యాంకు అధ్యక్షులు అచ్చుతరామారావు, వేలూరు బ్యాంకు అధ్యక్షులు అంబికాప్రసాద్, గుడివాడ బ్యాంకు అధ్యక్షులు పూర్ణా వీరయ్య, అనంతపురం బ్యాంకు అధ్యక్షులు మురళీధర్‌రాయల్, గుంటూరు బ్యాంకు అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, కోవెలకుంట్ల బ్యాంకు అధ్యక్షులు శ్రీనివాసరావు, గుత్తి బ్యాంకు సిఇఒ మహేశ్వరప్రసాద్, వైస్‌చైర్మన్ కృష్ణ, డైరెక్టర్లు స్టోర్ నాగరాజు, రాము, వెంకి, అంగడి నాగరాజు, వీరన్న, మధు, వెంకటేష్‌బాబు, దాదా, మహబూబ్, మహేష్, తదిరులు పాల్గొన్నారు.

# పేదలకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం అండగా నిలుస్తుంది

**- పేదవాడి ఆకలి తీర్చడమే ముఖ్య ఉద్దేశ్యం - తేదేపా రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ప్రారంభం**







అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న నిమ్మల కిష్టప్ప, సవిత, భోజనం వడ్డిస్తున్న దృశ్యం, ర్యాలీగా వస్తున్న తెలుగుదేశం శ్రేణులు

**పెనుకొండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

పేదవాడికి ఏ కష్టం వచ్చినా తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జ్ఞాపకార్థం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో అన్నా కా ్యంటీన్‌ను ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశ పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎ ంపి నిమ్మల కిష్టప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వంలో అధికారం ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు మీద వ్యక్తిగత కక్షతో అన్నా క్యాంటీన్లను పూర్తిగా మూసివేసిందని మండి పడ్డారు. రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చాలని ఉద్దేశ్యంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే వాటిపై వైసీపి మూకలు దాడులు చేయడం వారి దుర్మార్గమైన పాలనకు నిదర్శనం న్నారు. అన్నా క్యాంటీన్‌పై దాడులు చేయడం అంటే పేదలకు పొట్టకొట్టడమే అని, మీరు ఎన్ని దాడులు చేసినా తెలుగు దేశం పార్టీ పేదలకు అన్నం పెట్టి తీరుతామని ఆమె ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు స్ఫూర్తితో నిరంతరాయంగా నాణ్యమైన భోజనాన్ని అందిస్తామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఒక్క అవకాశం అంటూ ప్రజల ముందుకు వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి నిత్యవసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారన్నారు. పెనుకొండకు వివిధ మండలాల నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలు తలిర వస్తారని నిరుపేదలకు దృష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన భోజనం రూ.5లకు అందిస్తున్నామన్నారు. రానున్నరోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేగల వారి వివాహా వేడుకలకు పలువురు నేతల హాజరు





నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న పరిటాల సునీత,కాలవ శ్రీనివాసులు

**శింగనమల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

అనంతపురం తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి కుమారుడు దేగల హరీష్, హేమలతల వివాహ వేడుకలకు మాజీ మంత్రులు హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఆదివారం టిడిపి అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి-దేగల లలితమ్మల కుమారుడు హరీష్-హేమలతల వివాహం గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలోని వైఎల్ఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, శమంతకమణి, శైలజానాథ్, మాజీ ఎ మ్మెల్యేలు జేసి ప్రభాకర్‌రెడ్డి, యామినిబాల, టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు గాజుల ఆదెన్న, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు జగదీష్‌రెడ్డి, బికెఎస్ మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, వెంకట నరసనాయుడు, చితంబర దొర, బిసి సెల్ గంజి నాగరాజు, బిసి సెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, బుగ్గయ్య చౌదరి, మాజీ మేయర్ స్వరూప, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి,అహుడ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, ప్రతాప్‌నాయుడు, టిడిపి రాష్ట్ర నాయకులు వెంకట శివుడు యాదవ్, హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

02ATP12_02ATP12.qxd 12-02-2023 PM 10:23 Page 1



## ప్రాణం తీసిన అతివేగం

**- మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొన్న కారు**

**- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి**




కారు, బైకు ఢీ కొన్న దృశ్యం, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

**లేపాక్షి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

మండలంలోని బిసలమానేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మద్యం మత్తులో అతివేగంగా దూసుకువచ్చిన కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొన్న సంఘటనలో దినేష్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చిలమత్తూరుకు చెందిన ఇద్దరు యువకులు హిందూపురం నుండి మద్యం మత్తులో కారులో అతివేగంగా వచ్చారు. అదే సమయంలో బిసలమానేపల్లి గ్రామానికి చెందిన దినేష్ మోటర్‌సైకిల్‌పై ఎడమవైపు రహదారి చివరన వస్తుండగా అతివేగంగా వచ్చిన వారు మోటర్‌సైకిల్‌ను ఢీ కొంది. ఈ సంఘటనలో దినేష్ దుర్మరణం పాలయ్యాడు. ఆ సమయంలో చుట్టుపక్కల వున్న వారు సంఘటనా స్థలానికి చేరుకుని 108కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్‌అహ్మద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కారు డ్రైవర్ ముఖానికి గాయాలు కాగా మరో వ్యక్తి అక్కడి నుండి పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఉన్న ఒక కొడుకు పోయాడు ఇక మాకెవరు దిక్కు :**

బిసలమానేపల్లి గ్రామంలో నారాయణస్వామి (నాని), సిద్దమ్మలకు ఇద్దరు కుమారులు. వారిలో ఒక కుమారుడు 20 ఏళ్ల క్రితమే ఇల్లు వదిలి వెళ్లాడు. వున్న చిన్నకుమారుడు దినేష్ తమకు చేదోడువాదోడుగా వున్నాడు. తండ్రి నారాయణస్వామికి అనారోగ్యం కారణంగా ఎలాంటి పనులు చేసేందుకు వీలు లేకుండా ఇంటికి పరిమితమయ్యాడన్నారు. తల్లి సిద్దమ్మ సేద్యం పనులు చేసుకుంటూ వుండగా కుమారుడు దినేష్ సార్ డెనిమ్ కర్మాగారంలో పనిచేస్తూ తమ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడని అటువంటి కుమారుడు పోవడంతో తమకు జీవనం కష్టతరమైందని కన్నీటిపర్యంతమయ్యారు. ఇక తమకు మరణమే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటన మరో కుటుంబానికి జరగరాదని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

## ఘనంగా రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలు




మాజీ మంత్రి రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**గుడిబండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి 67వ జన్మదిన వేడుకలు ఆదివారం రొళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుకున్నారు. ఈసందర్భంగా వారు మండల కేంద్రంలో శనేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పార్టీ నాయకులు అభిమానుల మధ్య కేక్ కట్ చేసిజన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ క్రమంలో నాయకులు మాట్లాడుతూ.. రఘువీరారెడ్డి చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను ఆయన సేవలను కొనియాడారు. ఇందులో భాగంగా మడకశిర నియోజకవర్గంలో అగ్రికల్చర్‌పాలిటెక్నిక్, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలను, మడకశిరను మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు చేయడం, ప్రజలకు శ్రీరామిరెడ్డి పథకం ద్వారా తాగునీటిని అందించి జిల్లా రైతాంగానికి సాగునీటి సమస్య పరిష్కారం కోసం హంద్రీనీవా జలాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దేవరాజు, మండల అధ్యక్షులు గౌడప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షులు అన్వర్, మహిళా మండల అధ్యక్షులు జ్యోతి, నాయకులు పాండురంగారెడ్డి, జగన్నాథ్, తిమ్మప్ప, గంగారాం, మెడికల్ గంగేగౌడ్, దాసేగౌడ్, సతీష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన రజక సంఘం ఏర్పాటు

**లేపాక్షి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న రజకసంఘం నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షిలో ఆదివారం నూతన రజక సంఘం ఏర్పాటు చేశారు. మండల రజక సంఘం అధ్యక్షునిగా బయన్నపల్లి గ్రామానికి చెందిన రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లేపాక్షిలోని ఓ ప్రైవేటు భవనంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీరాములు వ్యవహరించారు. కమిటీ సభ్యులుగా గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా శంకరప్ప, నరేష్, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, సహాయక కార్యదర్శిగా రామాంజినేయులు, కార్యదర్శిగా ఈశ్వరప్ప, కోశాధికారిగా రామాంజనప్పలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు రవి మాట్లాడుతూ భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి విద్యా ఉద్యోగ రాజకీయపరంగా పోరాటం చేసి సంఘానికి న్యాయం చేస్తామని తెలిపారు.

## మల్బరీ తోటకు విష ప్రయోగం

**రొద్దం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



మల్బరీ తోటకు విష ప్రయోగం దృశ్యం

మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన రైతు మారుతి రెడ్డి మల్బరీ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు మారుతిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా .. శనివారం సాయంత్రం మల్బరీ ఆకు కోసుకుని యథావిధిగా పురుగులకు ఆకు వేసి వెళ్లిపోయాడు. ఉదయం వచ్చి చూడగా 150 మట్టి సంబంధించిన పురుగులు మొత్తం చనిపోయాయి. ఇంకో వారం రోజులు పంట చేతికి వచ్చేదని ఇలాంటి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నష్టపరిహారాన్ని అంచనావేసి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూడాలని రైతు మారుతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## నేడు స్పందన రద్దు

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రతి సోమవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నేడు రద్దు చేసినట్లు పౌరసమాచార శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున జిల్లా నలుమూలల నుండి విచ్చేసే ప్రజలు ఈ విషయాన్ని గమనించి మరలా వచ్చే సోమవారం తమ అర్జీలు సమర్పించాలని వారు కోరారు.

## మైలారలింగేశ్వరస్వామికి దోని పూజ ఉత్సవాలు



దోనిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

మండల పరిధిలో తమ్మిడేపల్లి గ్రామంలో వెలసిన మైలారలింగేశ్వరస్వామి దేవాలయం నందు ఆదివారం దోని పూజా కార్యక్రమంతోపాటు స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించరు. ఈ సందర్భంగా పూజారులు తమ్మిడేపల్లి హనుమంతరాయ, రంగప్ప, డిఎస్ మల్లికార్జునలు ప్రత్యక పూజలను స్వామి వారికి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దోని పూజ కార్యక్రమం నందు ఆలయానికి సంబంధించిన యజమానులు వీరకేతప్ప, శివలింగప్ప, అంజినప్ప, లింగప్ప తదితరుల సమక్షంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రాతోపాటు కర్నాటక ప్రాంతాలకు చెందిన దాదాపు 30 గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయానికి శిఖరానికి రంగులు వేయించిన దేవగానపల్లి బడిగి వీరకేతప్పకు ఆలయ ధర్మకర్తలు ఘనంగా సన్మానించారు. గొర్రవయల సమక్షంలో దోని పూజ కార్యమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపిటిసి లింగరాజు, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

## గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ



శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

**అమరాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

మండల పరిధిలోని హాలుకూరు గ్రామం నందు పోస్టు మాస్టర్ మధు సూదన్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై దేవతా పూజా కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, పార్లమెంటు టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి నవీన్, సీనియర్ నాయకులు మాజీ డీలర్ శ్రీనివాస్, సుబ్బారావు, గురుదేవప్ప, తెలుగు యువత ఉపాధ్యక్షులు రఘు, హాలుకూరు నాగరాజు తదతరులు పాల్గొన్నారు. విచ్చేసి ప్రముఖులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## రొద్దంకు విచ్చేసిన ప్రభోదానందస్వామి శిష్యులు

**- దైవ భక్తి కూడిన పుస్తకాలను గ్రంథాలయ అధికారికి అందజేత**

**రొద్దం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

శ్రీ కృష్ణ మందిరం ప్రభోదానంద స్వామి శిష్యులు రొద్దం మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ఆదివారం విచ్చేసారు. ఈ సందర్భంగా ప్రభోదానందస్వామి శిష్యులు యం. నాగభూషణం, పి. బాలకృష్ణ, పి. ప్రసాద్, బి. అశోక్, కెఎల్ లోకేష్, సి. రామచంద్ర లు దేవుని గుర్తు-963, మాయ గుర్తు మతము, పధము దేవుని తీర్పు, దేవాలయ రహస్యాములు మంత్రము, మహిమా నిగూఢ త్వార్థ బోధిని, సామెతల విజ్ఞానము , తల్లి, తండ్రి గురు ప్రార్థనామాంజిలి ఆత్మలింగార్థములు అంటే ఏమిటి పొంది బర్చిన దైవ భక్తి అంశాలతో కూడిన 15 పుస్తకాలను గ్రంథాలయ అధికారి నాగరాజుకు అందజేశారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారి నాగరాజు మాట్లాడారు. శ్రీ కృష్ణ మఠం ప్రభోదానంద స్వామి శిష్యులు అందజేసి పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచామని పాఠకులు పుస్తకాలను చదివి దైవ భక్తి, జ్ఞానం సంపాదించుకోవాలని సూచించారు.

## రేణిమాకులపల్లి ఎర్రవంకలో పూడికతీత పనులు

**-సర్పంచ్ బోయ రామాంజినేయులుకు అభినందనల వెల్లువ**

**ఉరవకొండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



పూడికతీత పనుల తొలగింపు దృశ్యాలు

మండల పరిధిలోని రేణిమాకుపల్లి గ్రామం లోని ఎర్రవంకలో పేరుకు పోయిన పూడికను తన సొంత నిధులతో తొలగించిన గ్రామ సర్పంచ్ బోయ రామాంజినేయులుకు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. వంకలో పూడిక నిండిపోయి దుర్వాసన వెదజల్లుతూ దోమల వ్యాప్తితో ఇప్పటిదాకా రోగాల బారిన పడుతూ ఇబ్బందులు ఎదుర్కొన్నామని తమ విజ్ఞాపన మేరకు సర్పంచ్ తన సొంత నిధులతో జేసీబీలను ఏర్పాటు చేసి రెండు రోజులుగా పూడికను తొలగింపజేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేక సంవత్సరాలుగా వంక పూడికతో నిండిపోగా కొందరు మురుగునీటిని అందులోకే వదులుతుండటం, గత నెలలో జరిగిన మారెమ్మ ఊరి దేవర సందర్భంగా వ్యర్థాలను సైతం అందులోనే పడేయడంతో అక్కడ అపరిశుభ్రత అధికమై కంపుకొడుతూ వచ్చిందన్నారు. వంక విషకీటకాలకు సైతం నిలయంగా మారడంతో బిక్కుబిక్కుమనే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సర్పంచ్ రామాంజినేయులు పూడికతీత పనులు చేపట్టడం ద్వారా ఊపిరి పీల్చుకున్నామని కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇన్సెంటివ్ ఇవ్వడం ఇంకెప్పుడు

**- మల్బరి రైతులు మొత్తుకుంటున్న పట్టించుకోరే..?**

**అగళి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

మల్బరి సాగు చేసి, మల్బరి గూళ్లను, మల్బరీ కేంద్రాలకు వెళ్లి విక్రయిస్తారు. మల్బరి కెజి గూడుకు ఇన్సెంటివ్‌గా 50 రూపాయలను ప్రభుత్వం ఇస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కూడా మల్బరీ రైతులకు ఇన్సెంటివ్‌ను అందజేశారు. మల్బరి కోవన్ రకం, మల్బరీ కడ్డీలను నాటడం మొదలు అది పెరిగి పెద్దయ్యాక మల్బరీ పురుగులకు మల్బరీ ఆకులను ఇస్తుంది. అక్కడి నుంచి పురుగులను బాగా పెంచితే మల్బరీ గూళ్లను పురుగు ఏర్పాటు చేసుకుంటుంది. ఇలా మల్బరి రైతులు ఎంతో కష్టపడి గూళ్లను విక్రయిస్తారు. అలాంటి మల్బరీ రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో కెజి మల్బరీకి 50 రూపాయల ఇన్సెంటివ్‌ను ఇస్తోంది. కానీ గత రెండేళ్లుగా ఇన్సెంటివ్ ఇవ్వడం ఆలస్యం చేస్తున్నారు. 15 రోజులో నెల రోజులో ఆలస్యం అయితే గత రెండేళ్లు మ ల్బరీ గూళ్లకు ఇన్సెంటివ్ ఇవ్వకపోవడంతో మల్బరి రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు కానీ ఇంత వరకు ఇవ్వలేదు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మల్బరి రైతులకు ఇచ్చే ఇన్సెంటివ్‌ను సత్వరమే అందిస్తే ఆ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

## 17న మండల సర్వసభ్య సమావేశం

**కనగానపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

ఈ నెల 17తేది శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) లక్ష్మినారాయన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని మండల అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

## పేదింట్లో మెరిసిన ఆణిముత్యం

**బుక్కపట్నంరూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



ప్రథమ స్థానం సాధించిన గజలక్ష్మిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలంలోని జానకం పల్లి గ్రామానికి చెందిన బెల్లం నాగార్జున, శాంతమ్మ దంపతుల కుమార్తె అయిన గజలక్ష్మి అనస్తిషియా టెక్నాలజీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచి పేదింట్లో మెరిసన ఆణిముత్యంలా పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. నాగార్జున, శాంతమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, కుమార్తె అయిన గజలక్ష్మి శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ బెంగుళూరు కళాశాలనందు అనస్తిషియా టెక్నాలజీ అయిన బిఎస్‌సి కార్డియో కేర్ టెక్నాలజీ విద్యను అభ్యశిస్తున్నది. ఇటీవల విడుదలై పరీక్షా ఫలితాల్లో ఆమె ప్రథమ స్థానంలో నిలవడంతో ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వెలిబుచ్చారు. కుగ్రామైన జానకంపల్లి నుండి బాబా వారి కళాశాలలో సీటు సాధించడమేకాకుండా, అత్యంత ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. ఈమె మరిన్ని విజయాలు సాధించి ప్రజలకు మంచి సేవలు అందించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

## నైతిక పరివర్తనతోనే మానవతావిలువలు



బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

నేటి సమాజంలో ప్రతి ఒక్కరు తమవంతు కర్తవ్యంగా నైతిక పరివర్తనతోనే మానవతావిలువలు పెంపొందుతాయని జమాతే ఇస్లాం హింద్ నాయకులు ఫజుల్లులా, మౌలానా అబ్దుల్‌హక్, తదితరులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మానవతానైతికత అనే అంశంపై వారు బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని మావతావిలువలు పెంపొందించేందుకు తమ సంఘం తరుపున కులమతాలకు అతీతంగా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షరీఫ్, మస్తాన్, జఫురుల్లా, ముస్తాక్, రిజ్వాన్, అబ్దుల్‌హక్, అక్తర్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉప్పలప్ప పట్టాభిషేకమహోత్సవ వేడుకలు



స్వాములు కొలువుదీరిన దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

గుత్తి మండలంలోని గొజ్జేపల్లి గ్రామంలో ఆదివారం ఉప్పలప్ప లింగదలప్ప, వసికేరిరామప్ప స్వాములు పట్టాభిషేక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వాములకు గంధ దారోత్సవం, నల్లకంబడి పూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అరంతరం మద్దకెరప్ప, గుంతకల్లప్ప, తలమరప్ప, కోటప్ప, కోహినూరప్ప, వదూగరప్ప, పుల్లెలప్ప, యల్లగురప్ప, తదితర దేవతలను ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.వెంకరామిరెడ్డితో పాటు పలువురు వైకాపా నాయకులు ప్రత్యేక పూజలు గావించారు.

## రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మృతి



రిటైర్డ్ హెచ్‌ఎం మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం, కృష్ణమూర్తి (ఫైల్‌ఫోటో)

**గుత్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని ఉప్పరవీధిలో నివాసం వుండే కృష్ణమూర్తి పంతులు (79) అనే రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆయన మృతి పట్ల వైకాపా పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరా, ఉపాధ్యాయ సంఘాల నేతలు, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## పెన్నానదీ పరివాహక ప్రాంతంలో..

**- పుణ్యసాన్నాలు ఆచరించిన వందలాది మంది భక్తులు**

**-భక్తులతో కిటకిటలాడిన ఏటి గంగమ్మతల్లి ఆలయం**

**-మాఘమాస 4వ ఆదివారం కావడంతో పూజలు**



పాత, కొత్త బిడ్జీల కింద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తుల దృశ్యాలు

**ఉరవకొండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



మండల పరిధిలోని పెన్నహోబిళ క్షేత్రం సమీపంలోని అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారి బిడ్జి కింద నుండి పారే పెన్నానది పరివాహక ప్రాంతంలో మాఘమాసం 4వ ఆదివారం వందలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆకరించారు. నీటి పరివాహక ప్రాంతంలో వెలసిన శ్రీ ఏటిగంగమ్మ తల్లి జాతర 3వ ఆదివారం ఈనెల 5వ తేదీన జరుగగా వేలసంఖ్యలో పాల్గొన్న విషయం తెలిసిందే. అయితే 4వ ఆదివారం కూడా భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గకపోవడం విశేషంగా చెప్పాలి. ఉదయం మోదలు సాయంత్రం వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు వివిధ వాహనాల్లో తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఏటి గంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకొని వాయినాలు సమర్పించి మోక్కులు తీర్చుకున్నారు. శ్రీ అశ్వర్థనారాయణ కట్టవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నది ఒడ్డున గొర్రెలు మేకలు, పొట్టేలు, కోళ్లను కోసి పాత ఐరన్ బిడ్జి, నూతన సిమెంట్ బిడ్జి క్రింద వండుకొని వన భోజనాలు సాగించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి తలనీలాలు సైతం సమర్పించారు. అన్ని నదుల్లోకెల్లా పెన్నానది ఎంతో పవిత్రమైనదని, మాఘమాసంలో ఈనదిలో పుష్కరుడు వుంటాడన్న నమ్మకంతో ఇక్కడ స్నానాలు చేసి మొక్కులు తీర్చుకోవడం అనాదిగా వస్తోంది.

## అపూర్వ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

**గోరంట్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

గోరంట్లలోని ఎస్ఎపిఎస్ జూనియర్ కళాశాలలో 1992-94 విద్యాసంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులు గెట్ టుగెదర్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మినారాయణ, అధ్యాపకులు రామాంజినేయులు, వర్మ, రమణారెడ్డి, రమేష్, నాన్‌టీచింగ్ స్టాఫ్ రామకృష్ణ, నరసింహులు హాజరయ్యారు. 30 ఏళ్ల తరువాత మళ్లీ విద్యార్థులందరూ ఒక్కటి కావడం ఆనందంగా వుందని వక్తలు పేర్కొన్నారు. ఇది మంచి సాంప్రదాయమని కొనియాడారు. నాలుగు గ్రూపుల విద్యార్థులు కలిసి ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం మాటల్లో చెప్పలేకపోతున్నామన్నారు. తమ కళాశాల విద్యార్థులు సైతం తమ నేపథ్యం చెబుతూ తమ ఉన్నతికి దోహదపడిన అధ్యాపకులకు, వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కళాశాలలో తాము చదివిన రోజుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని పులకించిపోయారు. ప్రధానంగా కార్యక్రమాల నిర్వహణ, రుచికర వంటలు తయారు చేయించడంలో కీలకపాత్ర పోషించిన శ్రీనివాస్‌నాయక్, అలీషేర్, రంజిత్‌నాయక్, కరావులపల్లి వెంకటరెడ్డి, పద్మలత, మల్లాపల్లి మహమ్మద్, టివిఎస్ రాజు, కమ్మలవాండ్లపల్లి గంగాధర్ కృషిని అందరూ అభినందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో ఫంక్షన్‌హాల్ హోరెత్తిపోయింది.

## రేషన్ కార్డు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించండి

**అగళి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

ప్రభుత్వం పేదలకు తెల్ల రేషన్‌కార్డులను అర్హులైన వారికి అందజేస్తుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వివాహాలు జరిగి పెళ్లిళ్లు అయిన తర్వాత ఉమ్మడి రేషన్‌కార్డు నుంచి వేరే రేషన్ కార్డు తీసుకోవడానికి, ఆ రేషన్‌కార్డులో ఇతరుల పేర్లను చేర్పించడానికి అవకాశం ఇవ్వాలని అర్హులైన వారు కోరుతున్నారు. దాదాపు 600 రేసన్ కార్డులు వివిధ నిబంధనలతో ఊడాయి కానీ కొత్తగా రేషన్‌కార్డులు తీసుకోవాలన్నా, పేర్లుచేర్పించాలన్నా, కొత్తవి తీసుకోవాలన్నా ఇబ్బందికరంగా మారిందని, వివిధ కారణాలతో పేర్లు చేర్పు, తొలగింపులకు కార్యాలయాల చుట్టూ తిప్పుతూ వెనక్కి పంపుతున్నారని కార్డు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత సర్టిఫికెట్లను తీసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తే సంక్షేమాలు వారికి అందుతాయి. కార్డు ఉంటేనే అమ్మఒడి, ఇన్‌పుట్ సబ్సిడి, చేయూత, చేదోడు, ఆసరా లాంటి పథకాలు దరి చేరుతాయని, వివిధ కారణాల నెపం చెప్పి మార్పులు చేర్పులకు అవకాశం కల్పించకుంటే పేదలకు ఇబ్బంది కరంగా మారుతుందని, కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

# నూర్పిడి యంత్రంలో వెళుతున్న ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ

**-ద్విచక్రవాహనంలో వెళుతున్న భార్యభర్తలకు తీవ్ర గాయాలు -ప్రమాదంలో మహిళ శరీరంలోంచి బయటపడ్డ అవయవాలు**

**-నూర్పిడి యంత్రంపై కూర్చొని వెళుతున్న ఇద్దరు కూలీలకూ గాయాలు -వజ్రకరూరు మండలం చిన్నహోతూరు గ్రామవద్ద ఘటన**



తీవ్రంగా గాయపడి మాబున్ని, సుభాన్



ప్రమాదంలో గాయపడిన పెద్దముష్టూరుకు చెందిన కూలీలు వన్నూరుస్వామి, బసమ్మ

**ఉరవకొండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

ఉరవకొండ రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని వజ్రకరూరు మండలం చిన్నహోతూరు గ్రామంవద్ద ఆదివారం రాత్రి నూర్పిడి యంత్రంతో వెళుతున్న ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడగా, నూర్పిడి యంత్రంపై కూర్చొని వెళుతున్న ఇరువురు కూలీలు గాయపడ్డారు. బాధితుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...

పొట్టిపాడుకు చెందిన భార్యా భర్తలు మాబున్ని, సుభాన్ అనంతపురంలో తమ పిల్లలను హాస్టల్‌లో చేర్చి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలు దేరారు. హోతూరు నుండి శెనగ నూర్పిడి యంత్రంతో ఉరవకొండ వైపునకు వస్తున్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఒకవైపు నుండి ఢీకొన్నట్లు సమాచారం. దీంతో భార్యా భర్తలు మాబున్ని, సుభాన్‌లకు నూర్పిడి యంత్రం బలంగా తగిలి కిందపడగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో మాబున్ని శరీరంలోంచి పేగులు, ఇతర అవయవాలు బయటపడ్డాయి. నూర్పిడి యంత్రంపై కూర్చొని వస్తున్న ఉరవకొండ మండలం పెద్దముష్టూరు గ్రామానికి చెందిన ఇరువురు కూలీలు వన్నూరుస్వామి, బసమ్మలు సైతం ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని 108లో, ఇరువురు కూలీలను ఇతరత్రా వాహనాల్లో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన భార్యా భర్తలు మాబున్ని, సుభాన్‌లతోపాటు కూలీ వన్నూరుస్వామిని మెరుగైన చికిత్స నిమిత్తం 108, వివిధ అంబులెన్సుల్లో వైద్యుల సూచనల మేరకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై వజ్రకరూరు పోలీసులు ఆరా తీస్తున్నారు.

